క్లుప్తంగా

చెస్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ సిద్ధార్థ నగర్‌లోని గ్లోబల్ చెస్ అకాడమీలో చదరంగం వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కస్టమ్స్ జాయింట్ కమిషనర్ నూతలపాటి సౌమ్య ఈ తరగతులను శనివారం సాయంత్రం ప్రారంభించారు. చిన్నారుల్లో మేథో శక్తిని పెంచేందుకు, భవిష్యత్తులో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు చదరంగం దోహదపడుతుందని సౌమ్య చెప్పారు. ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూన్ పదో తేదీ వరకు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయని అకాడమీ కార్యదర్శి షేక్ ఖాసీం తెలిపారు. గడిచిన 19 ఏళ్లలో నిర్వహించిన కోచింగ్ క్యాంప్‌ల ద్వారా 12 వేల మందికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. తమ అకాడమీలో శిక్షణ తీసుకున్న క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడా వేదికలపై రాణించినట్లు పేర్కొన్నారు. అకాడమీ వైస్ ప్రెసిడెంట్ బుద్ధరాజ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా మధురానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధురానగర్ వి వి నరసరాజు రోడ్, పప్పులమిల్లు, లెక్చరర్స్ కాలనీ, నేతాజీ కాలనీ, కొబ్బరితోట, దేవీనగర్ 6, 7, 8వ లైను తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వృద్ధాశ్రమానికి బియ్యం, చీరలు పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్):డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన దుర్గాపురం, బావాజీపేటకు చెందిన దాత పి.మల్లికార్జునరావు సహకారంతో మాతృదేవోభవ వృద్ధుల ఆశ్రమానికి శనివారం బియ్యం, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు వసంతకుమార్ మాట్లాడుతూ తమ వంతు బాధ్యతగా బియ్యం, చీరలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కారక్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

బంగారపు వస్తువులు చోరీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):వలంటీర్ ఇంట్లో 8 కాసుల బంగారం, రూ. 2 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపేట సుబ్రహ్మణ్యస్వామి గుడి ప్రాంతంలో శీలం వరలక్ష్మి, శ్రీనివాస్ దంపతులు నివాసం ఉంటున్నారు. వరలక్ష్మి 181వ సచివాలయంలో వలంటీర్‌గా ఉద్యోగం చేస్తుండగా, భర్త శ్రీనివాస్ తణుకులోని ఓ బ్యాంక్‌లో గుమస్తాగా ఉద్యోగం చేస్తుంటాడు. శనివారం ఉదయం శ్రీనివాస్ ఉద్యోగానికి వెళ్లగా, వరలక్ష్మి పిల్లలను స్కూల్‌కు పంపి ఇంటికి తాళాలు వేసి డ్యూటీకి వెళ్లింది. చిన్న కుమార్తె కార్తీకకు ఒంటి పూట స్కూల్ కావడంతో మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చేసింది. ఇంటి తలుపులు తెరిచి ఉండటమే కాకుండా బీరువాలో సామగ్రి చిందర వందరగా పడి ఉండటంతో వెంటనే తల్లికి ఫోన్ చేసింది. వరలక్ష్మి ఇంటికి వచ్చి చూడగా బీరువాలో ఉండాల్సిన నల్లపూసల గొలుసు, లక్ష్మీదేవి ఉంగరం, మరో ఉంగరం, చెవిజూంకాలు, రెండు కాసుల బంగారపు చైను, రూ. 2 వేల నగదు కనిపించలేదు. వరలక్ష్మి ఇంటికి తాళాలు వేసి ఆ తాళం చెవులను ఇంటి బయట ఉన్న బూట్లలో పెడుతుంటుంది. అయితే ఈ విషయం తెలిసిన వారే బంగారం చోరీకి పాల్పడిన ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు క్లూస్ టీం రంగంలోకి దింపింది. నిందితుల వేలి ముద్రల కోసం ప్రయత్నించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తల్లిపై కుమారుడు దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి వాటా ఇవ్వాలని తల్లిపై దాడి చేసిన కుమారుడిపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఆంజనేయ వాగు సెంటర్ వద్దెర కళ్యాణ మండపం ప్రాంతంలో బొంత లక్ష్మమ్మ నివాసం ఉంటుంది. లక్ష్మమ్మకు ఇద్దరు సంతానం. భర్త చనిపోవడంతో ఒంటరిగా ఉంటుంది. కుమారుడు అశోక్ తాపీ పని చేస్తుంటాడు. గతంలో అశోక్ తల్లిని ఇంటిలో నుంచి వెళ్లిపోవాలని వేధించడమే కాకుండా కొట్టడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. లక్ష్మమ్మ కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లింది. హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చిన లక్ష్మమ్మ వద్దకు వెళ్లిన అశోక్ తనకు ఇంటిలో వాటా ఇవ్వాలని వేధింపులకు గురి చేయడమే కాకుండా దాడి చేసి కొట్టాడు. దీంతో లక్ష్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

జగనన్న పాలనపై ప్రజల్లో రెట్టింపు నమ్మకం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విష్ణు, పక్కన కార్పొరేటర్ తిరుపతమ్మ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి సుపరిపాలనే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనపై రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఉన్న నమ్మకం మరింత రెట్టింపు అయ్యిందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 63వ డివిజన్ 276, 277వ వార్డ్ సచివాలయాల పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మతో కలిసి ఆయన విశాలాంధ్రకాలనీ, డాక్టర్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. 215 గడపలను సందర్శించి వారికి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

పారదర్శకంగా సంక్షేమ ఫలాలు....

డాక్టర్స్ కాలనీకి చెందిన దేవరకొండ నాగమణి అనే లబ్ధిదారురాలు మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో ప్రభుత్వ సంక్షేమ పథకం ఏదైనా పొందాలంటే ఆత్మాభిమానం చంపుకొని, కాళ్లు అరిగేలా జన్మభూమి కమిటీల చుట్టూ పదే పదే తిరగాల్సివచ్చేదని తెలిపారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని పథకాలు పారదర్శకంగా ఇంటికే వచ్చి అందిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. వైఎస్సార్ చేయూత, ఆసరా, జగనన్న చేదోడు, జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరయ్యాయని తెలిపారు. మరో లబ్ధిదారు షేక్ షరీఫున్నీసా మాట్లాడుతూ మా ఇళ్లకే వచ్చి సంక్షేమ పథకాలు అందించడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన వార్డ్ సచివాలయ వ్యవస్థ పనితీరు అద్భుతంగా ఉందని ప్రశంసించారు. జగనన్న వసతి దీవెన, అమ్మ ఒడి, సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ వాహనమిత్ర ద్వారా తమకు లబ్ధి చేకూరినట్లు తెలిపారు.

శాచ్యురేషన్ పద్ధతిలో సంక్షేమం...

గత టీడీపీ హయాంలో ప్రజలన్నా, ప్రజా సమస్యలన్నా కేవలం ఎన్నికల ముందు మాత్రమే గుర్తుకు వచ్చేవారని, కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి నిమిషం ప్రజలతోనే మమేకమవుతూ శాచ్యురేషన్ పద్ధతిలో నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఎమ్మెల్యే విష్ణు వివరించారు. అధికారంలో ఉన్నన్ని రోజులు అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి, అడ్డగోలుగా అవినీతి, అక్రమాలకు పాల్పడిన చంద్రబాబు, లోకేష్‌లు నేడు ప్రజల సమస్యల మీద మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న ఈ నాలుగేళ్లల్లో ప్రజల కోసం ఏనాడూ చంద్రబాబు మాట్లాడలేదని, తండ్రీ కొడుకులు కలిసి గోబెల్స్ ప్రచారాలు మాత్రం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం జగనన్న నేతృత్వంలో రాష్ట్రంలో అన్ని రంగాల్లో ముందంజలో ఉందన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా వచ్చేది మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని చెప్పారు. కార్పొరేషన్ ఈఈ శ్రీనివాస్, డీఈ రామకృష్ణ, ఏఈ అరుణ్‌కుమార్, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, ఆర్‌ఐలు ప్రసాద్, శరత్, సీడీఓ జగదీశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు పసుపులేటి యేసు, మోదుగుల గణేష్, సీహెచ్ రవి, టిక్యం కృష్ణ, సామ్రాజ్యం తదితరులున్నారు.

దాతల సహకారం వెలకట్టలేనిది

- బాలసదన్‌లో వాటర్ ప్లాంట్ ఏర్పాటు
- ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు



బాల సదన్‌లో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అనాథ బాలలను ఆదుకునేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పిలుపునిచ్చారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలో నిర్వహిస్తున్న బాలసదన్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ప్రారంభించారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కోస్టల్ బ్యాంక్ రూ. 1.50 లక్షల విరాళం అందించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనాథ బాలలకు అండగా ముందుకు వస్తున్న దాతల సహకారం వెలకట్టలేనిదన్నారు. వీధి బాలలు, అనాథలు, పేద బలహీన వర్గాల పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటుందని చెప్పారు. దీనికి తోడు దాతల సహకారం కూడా ఉంటే వారికి విద్య, వైద్యం అందించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. చిన్నారులకు సురక్షితమైన మంచినీటిని అందించేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన కోస్టల్ బ్యాంకు అధికారులను అభినందించారు. గతంలో బాలసదన్‌లో ఆశ్రయం పొందిన చిన్నారులకు బార్ అసోసియేషన్ సభ్యులు ముందుకు వచ్చి పుస్తకాలు, దుస్తులు అందించారని పేర్కొన్నారు. సదన్‌లో పెయింటింగ్స్ వేయించడం, వేడి నీటి సౌకర్యం కోసం గ్రీజర్, బట్టలు శుభ్రపరచుకునేందుకు వాషింగ్ మిషన్లు బహూకరించారన్నారు. బాల సదన్ చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందజేస్తూ పూర్తి పర్యవేక్షణ చేస్తున్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ రాధాకుమారిని అభినందించారు. చిన్నారులకు అవసరమైన దుస్తులు తయారు చేసుకునేందుకు న్యాయవాది వి. వనదుర్గ రూ. 70 వేల విలువగల కుట్టుమిషను, రోటరీ క్లబ్ సభ్యులు మిఠాయిలు పంపిణీ చేసి దాతృత్వాన్ని చాటుకున్నారన్నారు. వీరి స్ఫూర్తితో అనాథలను ఆదుకునేందుకు దాతలు ముందుకురావాలని కలెక్టర్ ఢిల్లీరావు కోరారు. ఐసీడీఎస్ పీడీ జి. ఉమాదేవి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు చంద్రగిరి రాధాకుమారి, కోస్టల్ బ్యాంకు ఏజియం జె. ఎస్ ఆర్ ఆంజనేయులు, మేనేజర్ వి. రామకృష్ణ, బాల సదన్ పర్యవేక్షకురాలు జోత్స్న, వసతి గృహ పర్యవేక్షకురాలు వి. సూర్యకుమారి సీడీపీఓలు పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్):దుర్గాపురంలో శనివారం బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన పాదచారులు, పారిశుద్ధ్య కార్మికులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్ సీపీ నాయకురాలు శీలం భవానీ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణప్రసాద్‌తో కలిసి మజ్జిగ పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు డి.వసంతకుమార్, కె. రాము, జి.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సన్‌సిరి ప్రాజెక్ట్స్ బ్రోచర్ ఆవిష్కరణ



పెనమలూరు: విజయవాడ సన్‌సిరి ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పెనమలూరులో నూతన వెంచర్ ప్రారంభించింది. ఈ మేరకు శనివారం సంస్థ కార్యాలయంలో బ్రోచర్ ఆవిష్కరించారు. సంస్థ చైర్మన్ భాష్యం అప్పారావు మాట్లాడుతూ ఇప్పటివరకు ఏపీసీఆర్‌డీఏ అప్రూవల్‌తో వేసిన వెంచర్లు కష్టమర్ల సహకారంతో విజయవంతంగా అమ్మకాలు చేశామన్నారు. ఇప్పుడు బందరు రోడ్డుకు దగ్గరలో కొత్తగా వేసిన వెంచర్ 40, 60 అడుగుల బీటీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ ట్యాంకు, తక్షణం గృహాలు నిర్మాణం చేసుకునే విధంగా 25 ఎకరాల్లో ప్లాట్లు వేశామని వివరించారు. భాష్యం రాజేష్ మాట్లాడుతూ ఇప్పటివరకు గంగూరు, ఈడుపుగల్లు, ముస్తాబాద్, కంకిపాడు ప్రాంతాల్లో వెంచర్లు వేశామన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): క్యాన్సర్ బాధిత బాలుడి కుటుంబానికి ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ చేతుల మీదుగా ఆర్థిక సహాయాన్ని అందచేశారు. గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో గల ఆయన కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ గుణదలకు చెందిన బంగారు తేజాచారి-స్వర్ణ దంపతుల కుమారుడు చిన్నారి యశ్వంత్ కుమార్ మూడవ తరగతి చదువుతున్నాడని, దురదృష్టవశాత్తు ఆ బాలుడు క్యాన్సర్ వ్యాధికి గురై చికిత్స పొందుతున్నాడని తెలిపారు. విషయం తెలుసుకున్న విశ్వ సాయి టౌన్‌షిప్ ఎండీ గుణాల కృష్ణ హేమంత్ అందించిన ఆర్థిక సహాయాన్ని తన ద్వారా బాలుడి కుటుంబసభ్యులకు అందచేశామని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలతోపాటు బాధిత బాలుడి వైద్యానికి స్వచ్ఛంద సంస్థలు, మనసున్న వ్యక్తులు ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు.

చిన్నారులకు యోగ్యతా పత్రాలు పంపిణీ



యోగ్యతాపత్రాలు, బంగారు పతకాలతో విజేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవటానికి శ్లోక, పద్య గేయ కంఠస్థ పోటీలు దోహదపడతాయని చిన్మయ మిషన్ ప్రచారకులు విష్ణుభట్ల లక్ష్మీనారాయణ, విశ్వహిందూ పరిషత్ ప్రచారకులు చల్లా లక్ష్మీనారాయణ తెలిపారు. ఆజాదికా అమృత్ మహోత్సవం సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్, వేద వ్యాస యోగ ప్రతిష్టాన ఆధ్వర్యాన నిర్వహించిన శ్లోక, పద్య గేయ కంఠస్థ పోటీల్లో విజేతలకు శనివారం ముత్యాలంపాడు భారతీయ విద్యా మందిర్ ప్రాంగణంలో యోగ్యతా పత్రాలు, బంగారు పతకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా విద్యా బోధన ఉండాలని కోరారు. భాస్కర్ రాజు లంక మీనాక్షి సమన్వయకర్తగా వ్యవహరించారు. 20 మంది విద్యార్థులకు యోగ్యతా పత్రాలు, బంగారు పతకాలు అందజేశారు.

పేదలకు మేలు చేసేందుకే నవరత్నాలు

ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



నేషనల్ ఫెలోషిప్ అవార్డులు అందుకున్న వారితో ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో కొన్ని పత్రికలు ప్రజల మనసులను కలుషితం చేయడానికి కంకణం కట్టుకుని పనిచేస్తున్నాయని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు విమర్శించారు. శనివారం విజయవాడ ఐలాపురం కన్వెన్షన్‌లో ఫిలంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి నేషనల్ ఫెలోషిప్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కొమ్మినేని మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు, వాటిలోని లోపాలను విమర్శిస్తే తప్పులేదన్నారు. కానీ అలా కాకుండా ప్రభుత్వం చేస్తున్న ప్రతి పనిని అడ్డంగా విమర్శించడం దురదృష్టకరమన్నారు. గతంలో ఇటువంటి పరిస్థితి తానెప్పుడు చూడలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌పై కక్షతో ఈ రాష్ట్ర ప్రజలపైన కక్ష తీర్చుకుంటున్నారేమోనని తాను భావిస్తున్నానన్నారు. పేదలకు మేలు చేసేందుకు ప్రభుత్వం నవరత్న పథకాలు అమలు చేస్తుంటే అది నాశనం అన్నట్లు చిత్రీకరిస్తున్నారన్నారు. పేదల పిల్లలు చదువకుంటే నాశనమా? ఇంగ్లిషు మీడియం ప్రవేశపెడితే అది విధ్వంసమా? అని ప్రశ్నించారు. తెలుగు మీడియమే గొప్పదని ప్రచారం చేస్తున్న ప్రముఖుల పిల్లలు ఏ ఒక్కరైనా తెలుగు మీడియంలో చదువుతున్నారా? ప్రభుత్వ బడులలో చదువుతున్నారా ?అని నిలదీశారు. కొన్ని పత్రికలు తామే ప్రతిపక్షంగా వ్యవహరిస్తూ ప్రభుత్వంపై దండోర ప్రకటించి తమ వ్యాపార, రాజకీయ ప్రయోజనాలు పొందుతున్నాయని ధ్వజమెత్తారు. బలహీనవర్గాలకు ఇంత అండగా నిలిచిన ప్రభుత్వాన్ని గతంలో తానెప్పుడూ చూడలేదన్నారు. అనంతరం విభిన్న రంగాల్లో కృషి చేసిన పలువురు ప్రముఖులకు గౌతమ బుద్ధ, జ్యోతిరావు పూలే, సావిత్రి భాయిపూలే, అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ పేర్లతో నేషనల్ ఫెలోషిప్ అవార్డులను అందజేశారు. ప్రెస్ అకాడమీ కార్యదర్శి బాలగంగాధర్ తిలక్, ఫిలంత్రోఫిక్ సొసైటీ వ్యవస్థాపకులు అద్దంకి రాజ, మేదర సురేష్, శ్రీ శ్రీ కళా వేదిక సమన్వయకర్త కొల్లి రమాదేవి, డాక్టర్ గూటం స్వామి, జల్లి విక్టర్ పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

పటమట(విజయవాడతూర్పు): ముస్లింల అభ్యున్నతికి తమ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. లబ్బీపేటలో అల్ మున్నీర్ ఫౌండేషన్ అధినేత షేక్ మున్నీర్ అహ్మద్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఇఫ్తార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజాద్‌బాషా మాట్లాడుతూ అన్ని రంగాల్లో మైనార్టీలకు ప్రభుత్వం స్థానం కల్పించిందని చెప్పారు. పాదయాత్రలో మైనార్టీల సమస్యలు తెలుసుకున్న జగన్ అధికారంలోకి రాగానే వారికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. మంత్రి పదవులు, కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్లుగా మైనార్టీలకు అవకాశం కల్పించిన ఏకైక ప్రభుత్వమన్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ రాహుల, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ముస్లిం ఫైనాన్స్ కార్పొషన్ చైర్మన్ ఆసీఫ్, వైఎస్సార్ సీపీ తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, హజ్ కమిటీ చైర్మన్ ఘోషల్ అహ్మద్, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ మెహబూబ్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విలువలతో నాయకత్వ లక్షణాలు

పటమట(విజయవాడతూర్పు): ఉత్తమ విలువలతో నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. పటమటలోని ఎన్‌ఎస్‌ఎం స్కూల్లో శనివారం విద్యార్థి నాయకుల ప్రమాణస్వీకారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కళాశాల సర్జికల్ అంకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్ రాయల్, చైత్ర హాస్పిటల్ ఎండోక్రైన్ సర్జన్ డాక్టర్ చైత్ర పాల్గొన్నారు. డాక్టర్ ప్రవీణ్ రాయల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అభ్యసించటం, పట్టుదల గుణాలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైత్ర మాట్లాడుతూ ఉత్తమమైన లక్షణాలను అలవర్చుకోవటానికి పాఠశాలే ప్రధాన వేదికలని తెలిపారు. అంకితభావం, సహకారం విద్యార్థి దశనుంచే అలవార్చుకోవాలని సూచించారు. పాఠశాల విద్యార్థి నాయకులుగా ఏవీడీ హర్షసాయి, విద్యార్థినుల నాయకురాలిగా కె. లాశ్య ఎన్నికకాగా, క్లబ్‌హౌస్, తరగతి నాయకులకు అతిథులు బ్యాడ్జిలను అందించారు. ఈ సందర్భంగా నిర్వహిచిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ రాయపరెడ్డి, కరస్పాండెంట్ మౌట్‌ఫోర్ట్, వైస్ ప్రిన్సిపాల్ బాలారెడ్డి పాల్గొన్నారు.

మరింత సుందరంగా నగరాభివృద్ధి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో విజయవాడ నగరానికి పునర్ వైభవం వచ్చిందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 31వ డివిజన్ టీచర్స్ కాలనీ 3వ లైన్, శ్రీనగర్ కాలనీ 4వ లైన్లలో రూ. 19.71 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రహదారులను నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష సత్యంలతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో రహదారుల నిర్వహణను కనీసం పట్టించుకోకపోవడంతో.. నియోజకవర్గంలో రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. ఫలితంగా చిన్నపాటి వర్షానికి కూడా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని చెప్పారు. కానీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సెంట్రల్ ప్రాంతమంతా నూతన రహదారులతో కళకళలాడుతోందని పేర్కొన్నారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకూడదన్న ఉద్దేశంతో ఈ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు వెల్లడించారు. పసుపుతోట పార్కు రోడ్డును ఇటీవల ప్రారంభించుకున్నట్లు గుర్తుచేశారు. రానున్న రోజుల్లో నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్ది భావితరాలకు అద్భుతమైన నగరాన్ని అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో నగరంలో పెనుమార్పు వచ్చిందని తెలిపారు. ముఖ్యంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు నేతృత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిరంతర ప్రక్రియగా కొనసాగుతున్నట్లు తెలియజేశారు. నగర సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తోన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలవాలని ఈ సందర్భంగా కోరారు. ఈఈ (ఇంజినీరింగ్) శ్రీనివాస్, నాయకులు బి. రవి, మానం వెంకటేశ్వరరావు, జయకర్, ఆకెళ్ల శ్రీను, కడవకొల్లు వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన బుడమేరు ప్రక్షాళన చేయాలి

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- మున్సిపల్ కమిషనర్‌తో బుడమేరు ప్రాంతంలో పర్యటన



కాలువ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు , కమిషనర్ పుండ్కర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్) బుడమేరు ప్రక్షాళనలో భాగంగా కాలువలో పేరుకున్న తూటికాడను యుద్ధప్రాతిపదికన తొలగించాలని ఇరిగేషన్ అధికారులకు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సూచించారు. నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇరిగేషన్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి బుడమేరు, రైవస్ కాలువ పరివాహక ప్రాంతాల్లో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. న్యూ ఆర్‌ఆర్ పేట, మధ్యకట్ట, అరండల్ పేట, గుణదల పరిసర ప్రాంతాల్లో కాలువలను పరిశీలించారు. నియోజకవర్గంలో దాదాపు 9 కిలోమీటర్ల మేర బుడమేరు విస్తరించి ఉందన్నారు. బుడమేరు, కాలువల్లో తూటికాడ, గుర్రపు డెక్క బాగా పెరిగిందన్నారు. గుర్రపు డెక్క తొలగింపు పనులను 10 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. దోమలు వ్యాప్తి చెందకుండా డ్రోన్ ద్వారా కాలువలో ఎంఎల్ ఆయిల్ పిచికారీ చేయాలన్నారు. అలాగే రైవస్ కాలువ ప్రక్షాళన పనులు వీలైనంత త్వరగా చేపట్టాలని పేర్కొన్నారు. మరోవైపు గడప గడపకి మన ప్రభుత్వంలో ప్రభుత్వం దృష్టికి వచ్చిన పనులతో పాటు న్యూరాజరాజేశ్వరి పేట, అరండల్‌పేటలో తాగునీటి వ్యవస్థను మెరుగు పరచాలని సూచించారు. దావు బుచ్చయ్యకాలనీ ప్రధాన రహదారి నిర్మాణ పనులకు అంచనాలు సిద్ధం చేయాలన్నారు. పర్యటనలో ఎమ్మెల్యే వెంట ఇరిగేషన్ ఎస్ఈ ఎస్. తిరుమలరావు, ఈఈలు కె. శ్రీనివాసరావు, కె. బాబు, ఇంజనీరింగ్ ఈఈ శ్రీనివాస్, జోనల్ కమీషనర్ సృజన, కార్పొరేటర్లు బంకా శకుంతల భాస్కర్, జానారెడ్డి, ఇసరపు దేవి, ఉద్దంటి సునీత, ఆయా శాఖల డీఈలు, ఏఈలు ఉన్నారు.

అన్నమయ్య పదాలు తెలుగు భాషా వీచికలు



అన్నమయ్య సంకీర్తనలు గానం చేస్తున్న శ్రీదేవి బృందం

విజయవాడ కల్చరల్: తాళ్ళపాక అన్నమాచార్య పదాలు తెలుగుబాషా వీచికలని భాషా సాంస్కృతిక, సామాజిక అంశాల సమాహారమని అన్నమయ్య పరివార్ వ్యవస్థాపకుడు యనమండ్ర వేంకటకృష్ణయ్య అన్నారు. అన్నమయ్య పరివారం, ఘంటసాల వెంకటేశ్వరారావు సంగీత కళాశాల త్రిపుర కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సంగీత కళాశాలలో అన్నమయ్య పదాలతో తిరుపతి యాత్ర భక్తి సంగీత విభావరి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదకవితకు ఆద్యుడు అన్నమయ్య అని కొనియాడారు. ఆయన సంకీర్తనలు భక్తి, భావ రాగ, తాళ యుక్తంగా ఉంటాయన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమయ్య సంకీర్తనలకు ప్రచారం కలిగిస్తోందన్నారు. సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కేవీస్ గోవిందరాజన్ తెలుగు సాహిత్యంలో అన్నమయ్య పద వైభవం అంశంగా ప్రసంగించారు గాయని ఎన్‌సీ శ్రీదేవి అన్నమయ్య సంకీర్తనలు కట్టిదురా వైకుంఠము, కొమ్మలారా ఎంతటి వాడే గోవిందరాజు, వేడుకొందమా, అల్లదివో శ్రీహరి వాసము తదితర కీర్తనలను మధురంగా గానం చేశారు. డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి, ఆర్ కల్యాణ్ కుమార్, పి.పాండురంగారావు వాద్య సహకారం అందించారు.

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ విఠల్‌రావు

భవానీపురం(విజయవాడపశ్చిమ):వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం చేస్తాయని విజయవాడ మెడికల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావు తెలిపారు. మానవతావాది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని గొల్లపూడి గ్రామంలోని అంబేడ్కర్‌నగర్‌లో డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేసి మాట్లాడుతూ ఎండలు మండుతున్న క్రమంలో వివిధ పనులపై ఇంటి నుంచి బయటకు వచ్చిన వారు దాహం తీర్చుకునేందుకు ఎదురు చూసే ప్రజల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు అభినందనీయులన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారి పక్కనే ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయటం వలన రహదారి వెంబడి రాకపోకలు సాగించేవారికి ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతగా ప్రజలకు సేవలు అందించాలని కోరారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఆర్.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఆర్.గోపాలం, ఎం.నరసింహారావు, డి.నాగేశ్వరరావు, ఎం.సంగీతరావు, జి.రత్నరాజు, కేజేఎస్ ప్రకాష్ పాల్గొన్నారు.

బాలుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): బెంజిసర్కిల్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మృతి చెందిన బాలుడి కుటుంబానికి దేవినేని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తక్షణ సాయం కింద బాలుడి తల్లి మల్లేశ్వరికి వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. పటమట సీఐ దాసరి కాశీవిశ్వనాథ్ బాలుడి మట్టిఖర్చుల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఇచ్చారు.